క్లుప్తంగా

పరిహారం మంజూరుకు వినతి



నెల్లూరు (పొగతోట): నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడిలో గృహ నిర్మాణాలకు ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో జేసీ కూర్మనాథ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన పేద రైతుల పొలాలను గృహ నిర్మాణాలకు తీసుకున్నారని తెలిపారు. ఈ భూములకు సంబంధించి కొందరి మాత్రమే పరిహారం ఇచ్చారని చెప్పారు. 67 మందికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని తెలిపారు. అధికారులు పరిశీలించి పరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన హ్యాండ్ రైటింగ్ శిక్షణా శిబిరం



నెల్లూరు (టౌన్): స్థానిక కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో అచర్విత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న ఉచిత హ్యాండ్ రైటింగ్ శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా హాజరై హ్యాండ్ రైటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అచర్విత ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృపాల్, కట్టా సురేష్, విశ్రాంత హెడ్‌మాస్టర్ రమణయ్య, తహసీల్దార్ రాఘవేంద్రరావు, హెచ్ఎంల సంఘ జిల్లా అధ్యక్షుడు చెంచురామయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిరుమలయ్య, ఫౌండేషన్ సభ్యులు కృష్ణయ్య, పాల్, శరత్, అంకయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): పుట్టింటికి వెళ్లివస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..చంద్రబాబునగర్‌కు చెందిన విజయలక్ష్మి గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు భర్త సుబ్రహ్మణ్యం వైద్యచికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి ఈ నెల 19న చెన్నూరులోని తన పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పింది. అప్పట్నుంచి ఆమె జాడ తెలియరాలేదు. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



నెల్లూరు(బారకాసు): గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల ఐక్య సంఘ రాష్ట్రాధ్యక్షుడు మర్రి వెంకటేశ్వర్లు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 23వేల మంది వీఆర్ఏలు విధులు నిర్వరిస్తున్నారని తెలిపారు. వీఆర్ఏలు చాలీచాలని జీతాలతో కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వీఆర్ఏల సమస్యలను పరిష్కరించి కుటుంబాలను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో వీఆర్ఏలు నారయ్య, వినయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): దుస్తులు ఇస్త్రీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన పొగతోటలోని నాగులమిట్ట రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు..నాగులమిట్టరోడ్డులో దళిత నాయకుడు కే చంద్రశేఖర్(52) కుటుంబం నివాసం ఉంటోంది. శుక్రవారం ఆయన తన ఇంట్లో దుస్తులు ఐరన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సమీపంలోని రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు నితిన్ చిన్నబజారు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షితాయికి కాసుల హారం బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో ట మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి సంగం మండలం వంగళ్లు గ్రామానికి చెందిన లేబూరు అఖిల్‌రెడ్డి, సుస్మిత దంపతులు సుమారు 79 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే మా అజెండా

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరాభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 43వ డివిజన్ జెండావీధి, యాహోళి వీధుల్లో రూ.65 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకం కింద నగర నియోజకవర్గానికి రూ.180 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గుర్రాలమడుగు సంఘం వద్ద జాఫర్ సాహెబ్ కాలువలో ఇళ్లలోని మురుగు కలవకుండా నేరుగా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు వెళ్లేలా డ్రైయిన్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. భగత్ సింగ్‌కాలనీ, వెంకటేశ్వరపురం, పొర్లుకట్ట ప్రాంతాల్లో పెండింగ్‌లోని డ్రైయిన్లను అమృత్ పథకంలో భాగంగా తక్షణమే పూర్తి చేస్తామన్నారు. నగర నియోజకవర్గానికి సంబంధించి ఒక్క రూపాయి అప్పులేకుండా తాను రూ.1000 కోట్ల తో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పూర్తయినవి కాకుండా కొత్త అభివృద్ధి పనులకు మరో నెలరోజుల్లో టెండర్లు పిలుస్తామన్నారు. గత ప్రభుత్వంలో నగరాన్ని ఎంత అభివృద్ధి చేశారో, తన హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.

సహనాన్ని పరీక్షించొద్దు

ఎమ్మెల్యే అనిల్ తనపై కొందరు చేస్తున్న విమర్శలకు సమాధానమిస్తూ తన సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు. ఈ మధ్య ఎక్కడ ఏం రచ్చ జరిగినా అది తనకు ఆపాదించడం కొందరికి అలవాటుగా మారిందన్నారు. ఓ కార్పొరేటర్ కార్యాలయంపై ఎవరో రాయి వేస్తే ఆలోచించకుండా అనిల్‌కుమార్ వేయించాడని బురద జల్లడం మంచిపద్ధతి కాదన్నారు. తనతో గిట్టని వ్యక్తులకు ఎక్కడ ఏ గొడవ జరిగినా అది తాను చేయించినట్లేనా అని ప్రశ్నించారు. ఏడాది నుంచి పత్రికా ముఖంగా తనపై ఎన్నో విమర్శలు చేశారని, ఏదో సినిమా చూపిస్తామని చెప్పింది వారేనని ఎద్దేవా చేశారు. అయినా తాను ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఎవరెవరు ఏ పత్రికల్లో తనపై అనవసరంగా విమర్శలు చేస్తున్నారో అన్నీ తెలుసునన్నారు. షాదీమంజిల్ విషయంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను బ్రష్టు పట్టించేందుకు ముస్లిం సోదరుల్లో అపోహ కల్పించారన్నారు. ప్రస్తుతం షాదీమంజిల్ ఎలా ఉందో చూడాలని రచ్చ చేసిన వారికి సూచించారు. రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు అన్నింటికి సిద్ధపడే వచ్చానని, ఇప్పటి వరకు ఓపిక పట్టానని, ఇక సహించబోనన్నారు. నోరుందని ఇష్టారాజ్యంగా మాట్లాడితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. బెట్టింగ్ విషయంలో కొందరు చేసిన పాపాలను తాను ఇప్పటికీ భరించాల్సి వస్తోందన్నారు. ఈ మధ్య ఓ వ్యక్తి కాలు విరగ్గొట్టుకుంటే దానిని కూడా తనపై రుద్దారన్నారు. పోలీసుల విచారణలో అది ఆయన కుమారుడి స్నేహితుల మధ్య గొడవేనని తేలిందన్నారు. ఆ రోజు తాను వీడియోలు చూపించకపోతే ఆ మచ్చ తనపై ఇంకా ఉండేదన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మీరామోహిద్దీన్, ముస్లిం సంచార జాతుల చైర్‌పర్సన్ సయ్యద్ ఆసీఫాబాబా, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం ప్రారంభం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): గృహాల్లోని నిరుపయోగ ప్లాస్టిక్, పాతపుస్తకాలు, దుస్తులు, చెప్పులు, తదితర వస్తువులను రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాల్లో అందజేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. నగరంలోని స్వతంత్రపార్కులో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని కార్పొరేటర్లు, అధికారులతో కలిసి శనివారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వ్యర్థాలను తగ్గించేందుకు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో రెడ్యూస్-చెత్త ఉత్పత్తిని వీలైనంతగా తగ్గించడం, రీయూజ్-చెత్త ఉత్పత్తికి కారణమయ్యే వస్తువులను కాలపరిమితి పూర్తయ్యే వరకు పదే పదే వినియోగించడం, రీసైకిల్-పూర్తి కాల పరిమితి దాటేంత వరకు వాడిన వస్తువులను పునరుత్పాదన చేయడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. నగర ప్రజలు పునరుత్పాదన చేయగల వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అందజేస్తే వాటిని అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామన్నారు. కార్పొరేటర్ వేలూరు మహేష్, నేతాజీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓవెంకటరమణ, ఈఈ చంద్రయ్య, డీఈ సురేష్, ఏఈ మాధవి, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. 26వ డివిజన్ జ్యోతినగర్, చంద్రమౌళినగర్, అయ్యప్పగుడి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వాహణను కమిషనర్ పరిశీలించారు. అయ్యప్పగుడి సమీపంలో హోటళ్ల నిర్వాహకులు రోడ్లపై చెత్తపడేయడాన్ని గుర్తించి పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే వ్యర్థాలను తిరిగి హోటల్‌లో వేయిస్తామని హెచ్చరించారు. విధుల్లో అలసత్వం వహించిన 26/2 సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి షోకాజ్ జారీ చేయాలని ఆదేశించారు.

సచివాలయాల్లో తనిఖీలు

30/3 కొండాయపాళెండొంక, 31/3 కుమ్మరగుంట వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

యూజర్ చార్జీలు చెల్లించాలి

వాణిజ్య భవనాల యజమానులు యూజర్ చార్జీలను క్రమం తప్పకుండా చెల్లించాలని కమిషనర్ సూచించారు. మినీబైపాస్‌రోడ్డులోని డీఎస్ఆర్ గెస్ట్‌ఇన్, విశాల్‌మార్ట్, పాండురంగఅన్నదాన సమాజం, సుమంగళి కల్యాణ మండపం, నెల్లూరు క్లబ్‌ను కమిషనర్ సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు మెక్లిన్స్‌రోడ్డు ప్రాంతంలో కాలువను ఆక్రమించి చేపట్టిన ఇంటినిర్మాణాన్ని కమిషనర్ పరిశీలించారు. పదిహేనురోజుల్లోగా స్వచ్ఛందంగా నిర్మాణాన్ని తొలగించుకోవాలని, లేకుంటే తామే తొలగిస్తామని ఆక్రమణదారులకు స్పష్టం చేశారు.

43వ దఫా రక్తదానం



నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ మద్రాస్‌బస్టాండ్ సెంటర్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో శనివారం 43వ దఫా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏడాదికి నాలుగు దఫాలు రక్తదానం చేయాలనే సంకల్పంతో క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నానని తెలిపారు. వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న దృష్ట్యా రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ కమిటీ కోశాధికారి మస్తానయ్య, కమిటీ సభ్యులు బయ్యా ప్రసాద్, యడవల్లి సురేష్, డాక్టర్ జయసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నెల్లూరు(బారకాసు): శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి వెన్నెల, సంపూర్ణ వ్యక్తిత్వ వికాస ఉచిత శిక్షణా తరగతులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ సేవా సమితి సేవాదళ్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామమూర్తినగర్‌లోని సత్యసాయి భజన మందిరంలో సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణానంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 99667 20678, 78428 33261 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హజ్ యాత్రకు తోడ్పాటు అభినందనీయం

నెల్లూరు రూరల్: పవిత్ర హజ్ యాత్రకు ముస్లింలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటును అందించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి రియాజ్ పేర్కొన్నారు. నగరంలోని 34వ డివిజన్‌లో ముస్లిం మైనార్టీ నేతలతో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1900మందికి పైగా ముస్లింలు హజ్ యాత్రకు ఎంపికైనట్లుగా తెలిపారు. వీరికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తుండడం సంతోషకరమన్నారు. ముస్లిం నాయకులు కంతర్‌అలీ, సందానీబాషా, కార్పొరేటర్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

నెల్లూరు(క్రైమ్): ఫిర్యాదు అందిన గంటల వ్యవధిలోనే తప్పిపోయిన చిన్నారుల ఆచూకీని గుర్తించి బాధిత తండ్రి చెంతకు నవాబుపేట పోలీసులు సురక్షితంగా చేర్చారు. భగత్‌సింగ్ కాలనీ టిడ్కోహౌస్‌లో సురేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు 10, 9 ఏళ్ల కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 19న రాత్రి ఇంటి వద్ద నుంచి ఎటో వెళ్లిపోయారు. బాధిత తండ్రి వారికోసం గాలించినా జాడ తెలియరాలేదు. శనివారం ఆయన నవాబుపేట ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా రైల్వేస్టేషన్‌లో ఉన్న ఇద్దరు పిల్లలను సంరక్షించారు. ఇన్‌స్పెక్టర్ తన ఛాంబర్‌లో బాధిత తండ్రికి అప్పగించారు. ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దాడిలో యువకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలో, మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదుకాని ఓ యువకుడిపై ఆరుగురు దాడికి పాల్పడిన ఘటన కుమ్మరవీధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..పెద్దబజారు కుమ్మరవీధికి చెందిన షేక్ హాజీ ఇంటీరియర్ డిజైన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఈ నెల 19న రాత్రి పనులు ముగించుకుని సుమారు 11.30 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో అటకాయించి దాడిచేశారు. గాయాలపాలైన హాజీని అతని తమ్ముడు ఖైదర్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు చెప్పిన వివరాల మేరకు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

హాజీపై దాడి విచారకరం

నెల్లూరు(బారకాసు): షేక్ హాజీపై దాడి విచారకరమని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. హత్యాయత్నానికి గురై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ హాజీని పలువురు కార్పొరేటర్లతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజీపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఎస్సార్ ఇంతియాజ్, గోగుల నాగరాజు, నాయకులు అల్లంపాటి జనార్దన్‌రెడ్డి, వడ్లమూడి చంద్ర, ఎస్కే మున్వర్, సురేష్, కమల్ పాల్గొన్నారు.

కస్తూరిదేవి విద్యాలయాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న బీ సురేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మి

నెల్లూరు(బృందావనం): దర్గామిట్టలోని కస్తూరిదేవి బాలికా విద్యాలయం ప్రాంగణంలోని దాతలు కట్టించిన భవనాన్ని అనుమతుల్లేకుండా రహస్యంగా కూల్చివేసిన ఘటనపై కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీమతి పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి కన్వీనర్,దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ సెక్రటరీ బీ సురేంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2004లో మాజీ మంత్రి నాగారెడ్డి వేణుగోపాలరెడ్డి కుమారుడు ఎన్ఆర్‌ఐ నిధులు రూ.25లక్షలతో భవనం కట్టించి కస్తూరిదేవి విద్యాలయానికి దానం ఇచ్చారని తెలిపారునీ భవనాన్ని ఈ నెల 13న విద్యాలయం ఏఓ ముసునూరు నరేష్ నుడా అనుమతి లేకుండానే కూల్చివేశారని ఆరోపించారు. ఇదే పరిస్థితి సాగితే విద్యాలయం అభివృద్ధికి దాతలు ఎవరు సహకరిస్తారని ప్రశ్నించారు. భవనం కూల్చివేతకు ఏటకు హెచ్ఎం వనజ, కల్యాణ మండపం లీజు యజమాని జీ వెంకటేశ్వరరావు సహకరించారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యాలయాన్ని కాపాడాలని కోరారు. సమితి కోశాధికారి గూడూరు లక్ష్మి పాల్గొన్నారు.

చరిత్రను తొలగించడం దారుణం



మాట్లాడుతున్న ఎంవీ చలపతి

నెల్లూరు(అర్బన్): పాఠ్యాంశాల నుంచి చరిత్రను తొలగించడం దారుణమని అధ్యాపకుడు ఎమ్వీ చలపతి అన్నారు. హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డార్విన్ పరిణామ సిద్ధాంతం, శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్వీ చలపతి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కర్ణాటకలో భగత్‌సింగ్, మహాత్మగాంధీకి సంబంధించిన అంశాలను పాఠ్యాంశాల నుంచి తొలగించిందన్నారు. ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, మొఘల్ చక్రవర్తుల పాలనను తొలగించడం దారుణమన్నారు. మొఘల్ చరిత్ర లేకుండా బ్రిటిష్ పాలన, స్వాతంత్ర్య ఉద్యమం, రాజ్యాంగ చరిత్రను వివరించడం సాధ్యం కాదన్నారు. అందుకే 1800 మంది శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతూ లేఖలు రాశారన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా మాట్లాడుతూ నేను ఎవర్ని..ఎక్కడి నుంచి వచ్చాను అనే అంశంపై ప్రసంగించారు. పాలకులు చరిత్రకు సమాధి కడుతున్నారని, కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు ప్రశ్నించి తీరాలన్నారు. కుల, మతాలు పేరుతో తామే అధికారంలో ఉండాలనుకునే పాలకులు చేసే కుటిల యత్నాలను తిప్పికొట్టాలన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ రమేష్‌బాబు, నగేష్, పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు, సైన్సు ప్రచార కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే విజ్ఞానం

- మరో గ్రంథాలయ ఉద్యమ సంస్థ నిర్వాహకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి మోటార్‌సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాలు

నెల్లూరు(అర్బన్): పుస్తకాలతోనే విజ్ఞానం, వికాసం లభిస్తుందని కథా రచయిత, మరో గ్రంథాలయ ఉద్యమ సంస్థ నిర్వాహకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు.గతంలో మాదిరిగా గ్రంథాలయాలను విరివిగా ఏర్పాటు చేసి పిల్లలతో పుస్తకాలను చదివించాలని, అందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతూ వెంకటేశ్వరరెడ్డి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర శనివారం నెల్లూరుకు చేరుకుంది. ఈ యాత్రకు మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లోని నెల్లూరు ఆస్పత్రి వద్ద వద్ద ప్రజాసైన్సు వేదిక, జనవిజ్ఞాన వేదిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన డీఈఓ, కలెక్టరేట్ అధికారులను కలిసి గ్రంథాలయ ఉద్యమానికి సహకారం అందించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను రచించిన శాంతివనం, పిల్లలు, ప్రయోగాలు, అనుభవాలు అనే పుస్తకాలను ప్రభుత్వం స్వీకరించి ప్రింట్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు పంపిణీ చేసిందన్నారు. ఆ అనుభవంతో తాను గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టానన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో సైతం రెండో తరగతి నుంచే పుస్తకాలు చదివిస్తున్నారన్నారు. ఫేస్‌బుక్‌ను డెవలప్ చేసిన జుకర్‌బర్గ్ సైతం ఆండ్రాయిడ్ ఫోన్‌ను వినియోగించడం లేదన్నారు. నేటి తరం పిల్లలు పుస్తకాలు మరిచి ఫోన్‌కు బానిసలవడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు, ప్రభుత్వం పిల్లలతో పుస్తకాలను చదివిస్తే మానసికంగా ఎదుగుతారన్నారు. మాతృభాషలో పుస్తకాలు చదివిన వారు ఏ భాషనైనా సులభంగా నేర్చుకోగలరని, అన్ని రంగాల్లో రాణించగలన్నారు. ఈ సమావేశంలో ప్రజాసైన్సు వేదిక రాష్ట్ర కార్యదర్శి నూనె నారాయణ, తెలుగుభాషోద్యమ సమితి జిల్లా కార్యదర్శి కొండమ్మ, జనవిజ్ఞానవేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు విజయమ్మ, కవి అవ్వారు శ్రీధర్‌బాబు, జాషువా గ్రంథాలయ కోశాధికారి కృష్ణయ్య, సాహితీవేత్త రమ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

నెల్లూరు(అర్బన్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మన ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.మన ఆస్పత్రి అధినేత డాక్టర్ మారం సుధాకర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రోగులు, క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి రక్తదాతలుగా మారాలని కోరారు. వేసవి నేపథ్యంలో రక్త నిల్వలు తగ్గడంతో కొరత తీర్చేందుకు రక్తదానం చేసిన మిత్రులు, ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ ఐఎస్‌రావు, అజయ్‌కుమార్, రమేష్‌బాబు, దగ్గుపాటి రాధాకృష్ణ, నోవా బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ పెంచలయ్య హెచ్చరించారు. సంతపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల మీద నిఘా ఉంచామన్నారు. బాలికల లింగనిష్పత్తి తక్కువగా గల మండలాల్లో మగ బిడ్డ, ఆడబిడ్డ ఇద్దరూ సమానమనే అవగాహన ప్రజల్లో కల్పించాలన్నారు. జిల్లా సలహా కమిటీ సభ్యులు గీతాలక్ష్మి, పద్మజ, సుల్తానా, డీపీఓ సదారావు, లీగల్ కన్సల్టెంట్ మున్వర్ సుల్తాన, ఎన్జీఓ నేత కుసుమకుమారి, రూప, డెమో అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే రంగంలోకి దిగిన సైబర్‌టీం, సంతపేట పోలీసులు సాంకేతికత ఆధారంగా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించారు. బాధితుడికి ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి తన ఛాంబర్‌లో శనివారం మొబైల్‌ను అందజేశారు. వివరాలు.. నగరంలోని కోటమిట్టకు చెందిన షేక్ షఫి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి. ఆయన పదిరోజుల క్రితం బృందావనంలో వెళుతుండగా ఫోన్ పోయింది. దీంతో కేంద్ర టెలీకమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్)పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ బృందం, సంతపేట పోలీసులు సాంకేతికత ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించారు. రోజుల వ్యవధిలోనే ఫోన్‌ను గుర్తించి అప్పగించిన పోలీసు అధికారులు, సిబ్బందికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ డీ హిమవతి, సైబర్ క్రైమ్, సంతపేట ఎస్సైలు సురేష్, వేణుగోపాల్, సిబ్బంది నరసయ్య, గౌస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఉద్యమం



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

నెల్లూరు (పొగతోట): ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఈ నెల 22 నుంచి దశల వారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు వై రమణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీజీఈఏ రాష్ట్ర నాయకత్వం అన్ని జిల్లాల్లో పర్యటించి ఉద్యోగుల పక్షాన న్యాయం కోరుతూ పోరాటాలు చేస్తుందన్నారు. ఉద్యోగులందరూ ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీజీఈఏ అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంచలయ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సైదాపురం మండలం పాలూరురాజుపాళెంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న గిరిజనుడు యల్లంపల్లి పెంచలయ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5న పెంచలయ్య బీసీ కులాలకు చెందిన వారు దాడికి పాల్పడడంతో తీవ్రమనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు న్యాయం చేయలేదన్నారు. మృతుడి భార్యకు న్యాయం జరిగే వరకు యానాదుల సంక్షేమ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి సైదాపురం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మృతుడి భార్య యల్లంపల్లి భారతి, యానాదులు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉష, నగర అధ్యక్షురాలు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు, శీను, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలి



నెల్లూరు(బారకాసు): చేనేత కార్మికుల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా చేనేత,జౌళి శాఖ కార్యాలయం ఎదుట చేనేత కార్మికులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. చేనేతల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లు బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీకు వినతిపత్రం అందజేశారు. కమిటీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, చిన్నబాలాజీ, పురుషోత్తం, సుధాకర్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.